క్లుప్తంగా

12 నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 12న గంగపూజ, అమ్మవారి రథోత్సవం, 13న జ్యోతుల ఉత్సవం, 14న చౌడేశ్వరిదేవి స్వస్థానం చేరుట, వివిధ పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

'జలజీవన్ మిషన్'పై అవగాహన



కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ దివ్య

లేపాక్షి: స్థానిక నందీశ్వర మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఉదయం జల జీవన్ మిషన్‌పై జలజీవన కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య మాట్లాడుతూ జలజీవన మిషన్ ప్రాధాన్యత, ప్రజలకు కలిగే ప్రయోజనాలు, జరగబోవు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ, ఎంసీఓ విజయకుమార్, ఎల్‌సీసీ, సీసీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

11న ఉచిత గుండె వైద్య శిబిరం



కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

హిందూపురం టౌన్: ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూపురం జోన్ యూటీఎఫ్ సహకారంతో అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆస్పత్రి వైద్యులతో ఈ నెల 11న పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాలలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు. శిబిరంలో బ్లడ్, షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. రిజిస్ట్రేషన్‌కు సెల్ నంబర్లు: 9866268081, 9491991799లను సంప్రదించాలని సూచించారు.


వైఎస్సార్‌సీపీతో అన్ని వర్గాలకు న్యాయం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

హిందూపురం: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ పూర్తిచేసి మాట నిలుపుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి కోరారు. మంగళవారం హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డు మోడల్ కాలనీ-2 సచివాలయ పరిధిలో వార్డు కౌన్సిలర్ 'రహమత్ బి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించారు. వేణురెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్న సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టాలన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



చౌళూరులో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: రాష్ట్రంలో అర్హులందరికీ అందుతున్న సంక్షేమ పథకాలు అలాగే కొనసాగేలా మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చౌళూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ నంజప్ప, ఎంపీపీ రత్నమ్మతో పాటు పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

జోరుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

- వాడవాడలా కొనసాగుతున్న ప్రక్రియ
- ఆనందంలో అక్క చెల్లెమ్మలు

హిందూపురం అర్బన్: నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టాలు అందించడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు రూ.1.80 లక్షలు, సామగ్రిని అందించి పేదల సొంతింటి కల నెరవేర్చింది. జగనన్న కాలనీల్లో అప్పటికే అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసింది. తాజాగా అక్కచెల్లెమ్మలకు ఇళ్లపై పూర్తిస్థాయి హక్కు కల్పించేలా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జోరుగా సాగుతోంది. స్థానికంగా ఉన్న సచివాలయాల్లోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుండటంతో మహిళలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం మండలంలో 5,500 వరకు, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో 2000 వరకూ ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఇందులో భాగంగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాలయ ఉద్యోగులు వేగంగా చేస్తున్నారు. పట్టణంలో 43 సచివాలయాలు ఉండగా అందులో కొన్ని వార్డుల్లో మినహా మిగిలిన అన్ని చోట్లా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాగుతోంది.



హిందూపురం 4వ వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ కోసం క్యూలైన్లో ఉన్న మహిళలు



బాలంపల్లి సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న లబ్ధిదారురాలు

మడకశిరలో 147 రిజిస్ట్రేషన్లు

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మండలంలోని గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయంలో మహిళల పేరు మీద ఇచ్చిన ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతోంది. మడకశిర మండలంలో మొత్తం 300 ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా 147 ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. హరేసముద్రంలో 33 మంది లబ్ధిదారుల పట్టాలు రిజిస్ట్రేషన్ చేశామని గ్రామ కార్యదర్శి ఆనంద్ కుమార్ తెలిపారు. పేదలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగనన్నకే మళ్లీ మద్దతిచ్చి సీఎంగా చేసుకొంటామని లబ్ధిదారులు చెబుతున్నారు.



హరేసముద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

సొంత అన్న కంటే ఎక్కువ



కడుపున పుట్టిన వారే పట్టించుకోని నేటి సమాజంలో సీఎం జగనన్న సొంత అన్న కంటే ఎక్కువగా మాలాంటి పేదలను పట్టించుకున్నారు. నా పేరు మీదనే ఇంటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. పేదలకు అన్ని విధాలా అండగా ఉన్న జగనన్నకే మేము మద్దతిస్తాం.

– రహమతున్నీసా, 4వార్డు, హిందూపురం

జగనన్న మేలు మరువలేం



మాలాంటి వారికి సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందిస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఇంటి పట్టా ఇవ్వడంతో పాటు ప్రభుత్వం తరఫున రూ.1.80 లక్షలు, సామాగ్రి కూడా అందించారు. ఇప్పుడు నా పేరు మీదనే ఇంటి రిజిస్ట్రేషన్‌ను కూడా ఉచితంగానే చేసిచ్చారు. ముఖ్యమంత్రి జగనన్న మేలును జీవితంలో మరువలేము.

– సాజిదా, 4 వార్డు, హిందూపురం

ఉన్నత చదువుతోనే బంగారు భవిష్యత్తు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

గుడిబండ: విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ నరసయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందులో భాగంగానే నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి చేస్తోందని చెప్పారు. అమ్మఒడి, జగనన్న విద్య కానుక, జగనన్న విద్యా దీవెనా, జగనన్న వసతి దీవెనా, విదేశీ విద్యతో పాటు ఉచితంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ద్వారా ట్యాబ్‌లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిషత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత చదువులు చదివించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం సీఎస్‌ఆర్ యాక్టివిటీలో భాగంగా కెనరా బ్యాంక్ ప్రతినిధులు రూ.60 వేల విలువ గల ఫర్నీచర్‌ను పాఠశాల లైబ్రరీకి అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణ కుమార్, మేనేజర్ లోక్‌నాథ్‌రెడ్డి, హెచ్‌ఎం గోవిందప్ప, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు డీఆర్డీఏ పీడీ.నరసయ్య సర్టిఫికెట్లను అందజేశారు. డీపీఎం రామమోహన్, నాగరాజు, రామిరెడ్డి, ఏపీఎం.తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

అమరాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మడకశిర గడ్డపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజవకర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హేమావతి గ్రామ విశ్రాంతి భవనంలో కుంచిటి వక్కలిగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈర లక్కప్ప మాట్లాడుతూ కేవలం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే సమన్వయకర్తగా అవకాశం వచ్చిందన్నారు. దీంతో మండలంలోని కుంచిటి వక్కలిగ కులస్తులు అత్యధికంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. మాజీ మంత్రి నర్సేగౌడ్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తమ కులస్తులను బీసీలుగా చేర్చారని, ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఓ అడుగు ముందుకేసి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్‌పర్సన్, డైరెక్టర్లను నియమించారని గుర్తు చేశారు. అలాంటి మంచి మనసున్న వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడ, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు వీరక్యాతరాయ, నాగరాజుగౌడ, ఎంపీటీసీలు నారాయణగౌడ, హనుమంతరాయ, కెంచప్ప, సర్పంచులు గోవిందరాయ, గిరిజమ్మ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్టారెడ్డి, గోవిందరాయ, సత్యనారాయణ, సిద్దప్ప, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త సోదరుడు రమేష్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

పలువురు నాయకులను కలిసిన లక్కప్ప

అమరాపురం మండలంలోని చిట్నడకు, హాలుకూరు గ్రామాల్లో మంగళవారం మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఈర లక్కప్ప పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పుష్ప, నాయకులు మైలారప్ప, తిప్పేస్వామి మల్లేష్, హనుమంతరాయ, శివన్న తదితరులను కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు పాల్గొన్నారు.



జ్యోతులతో మహిళలు



అలంకరణలో మహాలక్ష్మి

ఘనంగా జ్యోతుల ఉత్సవం

అగళి: మండల పరిధిలోని కోడిపల్లిలో కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, నాయకులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి



సోమందేపల్లి స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ బాజీజాన్‌సైదా

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ బాజీ జాన్ సైదా బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలు, పాత కేసుల్లో ముద్దాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీని కలసిన పాస్టర్లు

పెనుకొండ: పెనుకొండ నూతన డీఎస్పీ బాజీ జాన్ సైదాని చర్చిల పాస్టర్లు మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. స్థానిక బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ రెవ.సుధాకర్, జీపీస్ చర్చి ఫాదర్ మోజస్ డీఎస్పీని కలసిన వారిలో ఉన్నారు. అలాగే పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు డీఎస్పీని కలిశారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించండి



పులేరులో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: 'పేదల సంక్షేమాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు మరింత మంచి జరగాలంటే త్వరలో జరగబోయే సాధరణ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలి' అని పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పులేరు గ్రామ పంచాయతీ పరిధిలోని మరెడ్డిపల్లి, పులేరు, కొత్తబోయినపల్లి, జీనవాండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం సర్పంచ్ ప్రభాకరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, బూదిలి, వానవోలు సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్‌సాహెబ్, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రచయితల సంఘం అధ్యక్షుడిగా రాఘవేంద్రరావు



హిందూపురం టౌన్: రచయితల సంఘం హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా కల్లూరు రాఘవేంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా ఉత్తర్వులు జారీ చేశారని రాఘవేంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సచివాలయాల పరిశీలన

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల పట్టణంలోని 1, 2వ సచివాలయాలను మంగళవారం నూతన ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ఆయా సచివాలయాల పరిధిలో పేదలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులు తదితర వివరాలను తెలుసుకున్నారు.

17న భారత రాజ్యాంగ చైతన్యయాత్ర

పావగడ: కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న 'భారత రాజ్యాంగ చైతన్య రథయాత్ర' కు సంబంధించిన కరపత్రాలను స్థానిక సాంఘిక సంక్షేమశాఖ అధికారి సుదర్శన్ దొమ్మతమరి గ్రామ పంచాయతీ పీడీఓ రంగధామకు మంగళవారం అందజేశారు. సుదర్శన్ మాట్లాడుతూ ఈ నెల 17న యాత్ర పావగడకు వస్తున్న నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీల పీడీఓలు బహిరంగ సభలు ఏర్పాటు చేయాలన్నారు. డా బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ విశిష్టతను ప్రజలకు తెలియజేసే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని సూచించారు.

చిలమత్తూరుకు ఇన్‌చార్జి కార్యదర్శి నియామకం

చిలమత్తూరు: మండలంలోని మొరసలపల్లి కార్యదర్శిగా పనిచేస్తోన్న రామ్లానాయక్‌కు చిలమత్తూరు పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాల, కళాశాలను తహసీల్దార్ బాలనరసింహులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలోనే పబ్లిక్ పరీక్షలు ఉన్నాయని, శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సుందరరాజు తహసీల్దార్‌ను సత్కరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిలమత్తూరు: మండలంలోని చేనేపల్లిలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ప్రారంభించారు. మంగళవారం.2.50 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభించి పనులు కూడా పూర్తి చేయించారు. ఎంపీపీ

సంక్షిప్త సమాచారం

మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామంలో సీసీ రోడ్డును నిర్మించినట్లు ఎంపీపీ తెలిపారు.

పాత సర్క్యులర్‌నే అమలు చేయాలి

హిందూపురం: ఆర్టీసీలో సర్క్యులర్ 70/71ను అమలు చేయకుండా పాత సర్క్యులర్‌నే అమలు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హిందూపురం డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి మల్లికార్జున , రాష్ట్ర నాయకులు నబీరసూల్ , జిల్లా అధ్యక్షులు నాగార్జున రెడ్డి, రీజనల్ కార్యదర్శి ఏవివిరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

హిందూపురం: పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ఉండకూడదని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లవారుజామున కమిషనర్ వివిధ శానిస్టేషన్ వర్కర్స్ ఆఫీసులను తనిఖీలు చేశారు. శానిటరీ సెక్రటరీ, మెస్త్రీల అటెండెన్స్ జాబితాలు సమయపాలన పరిశీలించారు. కొందరు సమయానికి రాకపోవడాన్ని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెనుకొండ: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఏజీపీ భాస్కరరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. భాస్కరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు ఎన్నో చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో సీడీపీఓ శాంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ నేతృత్వంలో రాజకీయ ప్రతినిధులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పెనుకొండ రూరల్: అమ్మవారిపల్లి కియా పోలింగ్‌స్టేషన్ పరిధిలోని మునిమడుగు, దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, ఎర్రమంచి, గుట్టూరు పంచాయతీల్లోని పోలింగ్ స్టేషన్‌లను సీఐ యుగంధర్, ఎస్ఐ రంగడు మంగళవారం పరిశీలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించమన్నారు.

చేపల చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి మంగళవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరియన్న సమక్షంలో గ్రామ కార్యదర్శి ఆనంద్‌కుమార్ వేలం పాట నిర్వహించారు. నరేష్ అనే వ్యాపారి రూ.13 లక్షలకు వేలం దక్కించుకున్నాడు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మడకశిర: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి ఆవరణంలో గురువారం ఉదయం 10.30 గంటలకు మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

విదేశీ మద్యం స్వాధీనం



మద్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో సెబ్ ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అక్రమంగా తరలిస్తున్న విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఒక కారు సీజ్ చేశారు. ఆరు 350 ఎంఎల్ విదేశీ వైన్ బాటిళ్లు, రెండు 750 మి.లీ రెండు విదేశీ బాటిళ్లను సీజ్ చేశారు. అలాగే కర్ణాటక ఆర్టీసీ బస్సులో తనిఖీలు నిర్వహించగా ఒక బ్యాగులో తరలిస్తున్న రెండు కేసుల కర్ణాటక మద్యం ప్యాకెట్లు సీజ్ చేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ ఇంతియాజ్ పాల్గొన్నారు.

కేసు తారుమారు చేసే యత్నం !

విదేశీ బ్రాండ్‌ల మద్యం ఉన్న కారు రూ.కోట్లు విలువ చేస్తుందని సమాచారం. స్వయంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే కర్ణాటక నుంచి పోలీసు ఉన్నతాధికారులు ఒత్తిడి మేరకు అందులోని బాటిళ్లు బయట పడేసి కేసు తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. చివరకు మాత్రం కారును హిందూపురం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. కానీ స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యం బ్రాండ్‌లను చూపెడతారో లేక ఇతర మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు చూపిస్తారో చూడాలి.

మహిళల అభ్యున్నతే ధ్యేయం



అమ్మాజక్కకు చెందిన ఫ్యాన్సీ స్టోర్‌ను పరిశీలిస్తున్న నేపాల్ బృందం

రొళ్ల: ఆర్డీటీ ద్వారా ఒంటరి మహిళల ఆర్థిక పురోగతి అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు మడకశిర ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం రొళ్ల పట్టణంలోని గుడిబండ ప్రధాన రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఆర్డీటీ తరుపున రూ.70 వేల ఆర్థిక సహకారంతో ఒంటరి మహిళ అమ్మాజక్క ఏర్పాటు చేసుకున్న ఫ్యాన్సీ జనరల్ స్టోర్‌ను నేపాల్ బృందం సభ్యులు పర్యటించి పరిశీలించారు. ఇక్కడి ప్రజల జీవన విధానాలు, అవలంభిస్తున్న ఆచారాలను వారు తెలుసుకున్నారు. ఆర్డీటీ రీజినల్ కోఆర్డీనేటర్ మల్లికార్జున మాట్లాడుతూ వివిధ దేశాల దాతల సహకారంతో ఆర్డీటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 319 మంది ఒంటరి మహిళలను గుర్తించి 96 మంది ఆసరా లేని ఒంటరి మహిళలకు వ్యాపార లావాదేవీల కోసం రూ.3 కోట్ల వ్యయం చేశామన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

రొళ్ల: బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలిద్దామని మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ, ఐసీడీఎస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా ఆర్డీటీ టీం లీడర్, చైల్డ్ కోఆర్డీనేటర్ ఆదినారాయణ అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.